క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యానికి పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేసేందుకు రాష్ట్రీయ సర్వేక్షణ–పరఖ్ 2024 పేరుతో జాతీయ సాధన సర్వే నిర్వహించారు. బుధవారం సత్యవేడులోని యూపీ స్కూల్ , మాస్టర్ స్కూల్‌లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు అచీవ్‌మెంట్ టెస్టు ఉదయం 10.30 నుంచి 12.30 వరకు నిర్వహించారు. విద్యార్థులు ఓఎంఆర్ పత్రాలపై జవాబులు గుర్తించారు. 3వ తరగతికి 45, ఆరో తరగతికి 51, తొమ్మిదో తరగతికి 60 ప్రశ్నలకు జవాబులు గుర్తించారు. సూపర్‌వైజర్‌లుగా డి.దుర్గాప్రసాద్, ఏ.హేమనాథయ్ , బి.విక్రం , పరిశీలకులుగా జ్యోతి యాదవ్, ఎస్‌కే.సుమన్ విధులు నిర్వహించారు. ఎంఈవోలు కే.రవి, ఉషా పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఎంఈఓ బాబయ్య

నాగలాపురం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈఓ బాబయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగవైకల్యము అనేది శరీరానికే కాని మనసుకు కాదన్నారు. మేనరిక వివాహాలు , ప్రసవ సమయంలో గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పిల్లలకు అంగవైకల్యం సంభవించడం జరుగుతుందని, ఇప్పుడు అందరిలో చైతన్యం కలగడం వల్ల అంగవైకల్యం సమస్యలు చాలావరకు తగ్గిపోయాయన్నారు. బుద్ధిమాంద్యం, శారీక లోపం వల్ల ఇబ్బందులు పడుతున్న పిల్లల కోసం భవిత కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, చెంచమ్మ, ఐఆర్‌టీ టీచర్ శివప్రశన్న, జైపాల్, వసంత, సీఆర్‌పీ శివయ్య పాల్గొన్నారు.

చిన్నారులను ప్రోత్సహించడం అభినందనీయం



బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ

సత్యవేడు : ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పట్ల బాధ్యతతో మెలగాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో భవిత సిబ్బంది, ఎంఆర్‌సీ సిబ్బంది, ఎంఈఓలు, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యతో నిమిత్తం లేకుండా అన్ని రంగాల్లో రాణించేలా భవిత కేంద్రం ఉపాధ్యాయులు చిన్నారులను ప్రోత్సాహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీలో విజేతలకు బహుమతులను ఎంఈఓలు, ఎంపీడీఓ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవి, ఉషా, సహిత కేంద్రం ఉపాధ్యాయులు వెంకటరత్నం, దివ్య, సిబ్బంది మోహన్, విజయ్ పాల్గొన్నారు.

రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని పూజలు



శ్రీకాళహస్తి ఆలయం వద్ద షార్ అధికారులు

శ్రీకాళహస్తి : శ్రీహరికోట నుంచి ప్రయోగించనున్న పీఎస్‌ఎల్‌వీ–సీ 59, ప్రోబా–3 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని బుధవారం ఉదయం షార్ అధికారులు శ్రీకాళహస్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. షార్ అధికారులు యశోధ, ఎంఎస్ గుప్తా తదితరులు ముక్కంటి ఆలయానికి విచ్చేశారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా హరినాథ్

రేణిగుంట : సీపీఎం తిరుపతి జిల్లా కమిటీ సభ్యుడుగా రేణిగుంట మండల కార్యదర్శి కె. హరినాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్యవేడులో జరిగిన సీపీఎం 14వ జిల్లా మహాసభల్లో 15 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఏకగ్రీవంగా తనను రెండో సారి ఎన్నుకోవటం ఆనందంగా ఉందని, రాష్ట్ర నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

సచివాలయం.. సేవలు దూరం

- నేటికీ తెరుచుకోని పథకాల వెబ్‌సైట్లు
- ఆధార్ మార్పు, చేర్పులకు ఇబ్బందులు
- సేవల కుదింపుతో ఇక్కట్లు
- మండల కార్యాలయాలకు పరుగులు పెడుతున్న జనం

బుచ్చినాయుడుకండ్రిగ : గ్రామ స్వరాజ్య సాధన కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను విప్లవాత్మకంగా తీసుకొచ్చింది. ఈ వ్యవస్థ సక్రమంగా సాగేందుకు వీలుగా అవసరమైన ఉద్యోగులను నియమించింది. మీ సేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో అందించే సేవలన్నింటినీ సచివాలయ పరిధిలోకి తీసుకొచ్చింది. గత అయిదేళ్ల కాలంలో ఏ పని కావాలన్నా ప్రజలు సచివాలయాన్నే ఆశ్రయించారు. ఇటీవల అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలందించే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఒక వెబ్‌సైట్ కూడా ఓపెన్ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు ఏ చిన్న పని కావాలన్నా మీ సేవా కేంద్రాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని 28 పంచాయతీల్లో 14 సచివాలయాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ నియమించి, సచివాలయ వ్యవస్థ ద్వారా దాదాపు 545 రకాల సేవలను ప్రజల ఇంటి వద్దకే అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడేశారు. దీంతో వారి సేవలు బంద్ అయ్యాయి. సచివాలయం ద్వారా అందించే కీలకమైన సేవలను నిలిపివేసింది. మళ్లీ పాత వ్యవస్థలను తెరపైకి తెచ్చేందుకు నెమ్మదిగా ప్రయత్నాలు ప్రారంభించింది. అధికారంలోకి వచ్చి అయిదు నెలలు గడుస్తున్నా సేవలను పునరుద్ధరించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలోని సచివాలయం

ఆధార్ కేంద్రాలు లేక



విద్యార్థులకు ఆధార్ తరహాలో శాశ్వత విధానంలో ప్రత్యేక సంఖ్యతో కూడిన గుర్తింపు ప్రక్రియ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. అయితే ఆధార్‌లో స్కూల్ రికార్డులో వివరాలు తేడా ఉండటంతో అపార్ నమోదు చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని సరిచేసుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు మీసేవ, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. అదే సచివాలయాల్లో ఆధార్ సేవలు కొనసాగించి ఉంటే సమస్యలు పరిష్కారం అయ్యేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కార్యాలయాలకు తిరగలేక ఇబ్బందులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో సాధారణ సేవలు తప్ప కీలక సేవలు అందడం లేదు. దీంతో ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రజలు మండల కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సచివాలయాల్లో 1బీ, కులం, ఆదాయం వంటి సాధారణ సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన కొత్త రేషన్‌కార్డు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదు. దీంతో అనేక మంది ఇబ్బందులు పడుతూ మండల కార్యాలయ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

ఆధార్ సవరణల కోసం అవస్థలు



నేను వ్యవసాయం చేస్తున్నా. నా ఆధార్ కార్డులో అడ్రస్, సెల్‌ఫోన్ నంబర్లు తప్పుగా ఉన్నాయి. వాటి సవరణల కోసం మీ సేవ, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నాను. దీంతో సమయం వృథా అవుతోంది. రోజులు గడుస్తున్నాయే తప్ప పనులు కావడం లేదు. గతంలో సచివాలయాల్లో ఆధార్ సవరణలు చేసేవారు. దీంతో ఇబ్బంది లేకుండా ఉండేది.

- తిరుపాల్, తలారివెట్టు

ప్రజల అవసరాలు తీర్చాలి



సచివాలయాల్లో తక్షణమే వెబ్‌సైట్లు ఓపెన్ చేసి ప్రజలకు సేవలు అందించాలి. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి అయిదు నెలలు గడుస్తున్నా ఆరోగ్యశ్రీ , కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రచారాలు మానుకుని ప్రజలు అవసరాలు తీర్చాలి.

- గురవయ్య, కంచనపుత్తూరు

సేవలు పునరుద్ధరించాలి



సచివాలయంలో సాధారణ సేవలు తప్ప కీలకమైన సేవలు అందడం లేదు. దీంతో చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఏదీ కావాలన్నా సచివాలయానికి వెళ్లి తీసుకునే వాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆలోచించి సేవలను వెంటనే పునరుద్ధరించాలి.

- నాగార్జున్, పుత్తేరి

మాజీ సర్పంచ్ మృతి పార్టీకి తీరని లోటు



విజయ్‌భాస్కర్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతపూడి విజయ్‌భాస్కర్ (53) బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయ్ భాస్కర్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన పార్టీ కోసం అహర్నిశలు పనిచేశారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ పార్టీ అండగా నిలబడుతుందని తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనరు వేలూరు రాకేష్, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, ఉగ్గుమూడి గురునాథం, నాయకులు అజయ్ కుమార్‌రెడ్డి,గురవయ్య, జయచంద్రనాయుడు, వెంటాద్రి, దినకర్, కిరణ్‌యాదవ్, కారణి వెంకటేష్, సర్పంచ్ జనార్దన్ పాల్గొన్నారు.

విష జ్వరాలపై ఇంటింటి సర్వే



కోవూరుపాడులో జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న మోహన్

వరదయ్యపాళెం : మండలంలోని కోవూరుపాడులో విష జ్వరాలపై చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల బృందం బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించింది. మంగళవారం శివయ్య అనే వ్యక్తి జ్వరంతో మృతి చెందాడు. దీనిపై స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచనల మేరకు మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్ ఆధ్వర్యంలో ఎంపీహెచ్‌ఓ రవీంద్రుడు, సూపర్ వైజర్ పవన కుమారి, సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి జ్వరాలపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వతో దోమలు విస్తరించి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వినియోగించిన వస్తువులు, ఇతర వస్తు సామగ్రి ఇళ్ల పరిసరాల్లో ఉంచరాదన్నారు. అనారోగ్య సమస్య వచ్చిన తక్షణమే చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి వైద్య సేవలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లో లార్వా నియంత్రణకు మందు పిచికారీ చేశారు. అలాగే ఇళ్ల వద్ద వినియోగిస్తున్న నీటిని సేకరించి పరీక్షల కోసం తీసుకెళ్లారు. వారి వెంట ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

తుపాన్ నష్ట నివారణ చర్యలపై స్పందించాలి

- వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం : ఫెంగల్ తుపాను కారణంగా నష్టపోయిన అన్ని వర్గాలను ప్రభుత్వం ఆదుకోవాలని, తక్షణమే సహాయక చర్యలపై దృష్టి సారించాలని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. వర్షాల కారణంగా సత్యవేడు నియోజకవర్గంలో పెద్దఎత్తున రోడ్లు దెబ్బతినడంతో పాటు కేవీబీపురం, నాగలాపురం మండలాల్లో కాజ్‌వేలు కొట్టుకుపోయి పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, అలాంటి ప్రాంతాల్లో వేగవంతంగా పునరుద్ధరణ పనులు చేపట్టి తక్షణమే రాకపోకలను పునరుద్ధరించాలని కోరారు. అంతేకాక పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో అధికారులు పర్యటించి తక్షణమే అంచనాలు సిద్ధం చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే మగ్గపు గుంతల్లోకి నీరు చేరి ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపుగా నెలరోజులకు పైగా నేతకు దూరమైన వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలన్నారు. అలాగే వరుసగా కురుస్తున్న వర్షాలతో ఉపాధి కోల్పోయిన రైతు కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు నిత్యావసర సరుకులు తక్షణ సాయం కింద పంపిణీ చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. గ్రామాల్లో దెబ్బతిన్న పూరిళ్లను గుర్తించి వారికి తక్షణమే ఇళ్లు నిర్మించి ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం సమస్యలపై స్పందించి పేద ప్రజలకు అండగా నిలవాలని రాజేష్ ఈ సందర్భంగా కోరారు.

పంట పొలమే...శ్మశానానికి దారి

- కోవూరుపాడులో మరుభూమికి దారి కష్టాలు
- చస్తే ఉన్నవాళ్లకు చావే అంటున్న వైనం
- అగచాట్లు పడుతున్న జనం



కోవూరుపాడులో పొలాల నడుమ మృతదేహాన్ని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

వరదయ్యపాళెం : స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తవుతున్నా నేటికీ మరుభూమికి సరైన దారి సౌకర్యం లేక అగచాట్లు పడుతున్నారు. వరదయ్యపాళెం మండలం కోవూరుపాడులో శ్మశాన వాటికకు దారి లేక మనిషి చనిపోతే ఉన్న వాళ్లకు చావే అన్న పరిస్థితి దాపురించింది. మృతదేహాన్ని శ్మశానానికి తరలించేందుకు దారి ఇబ్బందులతో అష్ట కష్టాలు పడాల్సిన దుస్థితి నేటికీ కొనసాగుతోంది. ఆ మేరకు మంగళవారం శివయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. ఆయనకు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. అయితే గ్రామం నుంచి కి.మీ దూరంలో పంట పొలాల నడుమ ఉన్న శ్మశానవాటికకు శివయ్య మృతదేహాన్ని తరలించేందుకు వారి కుటుంబ సభ్యులు పడిన కష్టాలు మాటల్లో చెప్పలేనివి. వారికి బంధు వర్గం అంతంత మాత్రం కావడంతో పాడె మోసేందుకు పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యులు లేకపోవడంతో పంట పొలాల మీదుగా శవాన్ని తరలించేందుకు నానాపాట్లు పడ్డారు. ఏపుగా పెరిగిన వరి పంట నడుమ, వర్షపు నీటితో నిండుగా ఉన్న పొలాల్లో అడుగు తీసి అడుగు వేయలేని బురద మట్టిలో శవ పేటికను మోయలేక నానా కష్టాలు పడి మృత దేహాన్ని మరుభూమికి చేర్చారు. ఇలా ఆ గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారిని శ్మశాన వాటికకు తరలించేందుకు ఉన్న వారికి చావు తప్పదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. శ్మశాన వాటిక ఉన్న ప్రాంతానికి చుట్టూ ఉన్న పొలాలు పట్టా భూములు కావడంతో దారి ఏర్పాటు కాలేదు. ప్రభుత్వం స్పందించి రైతులతో చర్చలు జరిపి శ్మశానవాటికకు దారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులకు సత్కారం

శ్రీకాళహస్తి : ముక్కంటి దర్శనానికి బుధవారం బీసీసీఎల్, హెచ్‌పీఎల్ పైప్‌లైన్ ప్రాజెక్టు లీడర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధికారి అభయ్‌కాంబ్లే, హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ నారాయణరావు దర్శించుకున్నారు. వారిని దర్శనానంతరం సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

కాపు సంఘం అధ్యక్షుడిగా రమేష్



సత్యవేడు : నియోజకవర్గ జాతీయ కాపు సంఘం అధ్యక్షుడిగా సత్యవేడు పంచాయతీ సర్పంచ్ మంజుల భర్త రమేష్ ఎంపిక అయ్యారు. ఈ మేరకు జాతీయ కాపు సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన సంఘం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. కాపు సంఘం బలోపేతానికి, ఆర్థిక, సామాజిక, రాజకీయ ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వరదయ్యపాళెం : వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం తిరుపతికి చెందిన శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఆ మేరకు శాస్త్రవేత్తలు డాక్టర్ టి. ప్రతిమ, డాక్టర్ సరళ, డాక్టర్ కె. దేవకి, హేమలత నియోజకవర్గంలోని పిచ్చాటూరు, కేవీబీపురం మండలాల్లో పర్యటించారు. రామాపురం అప్పంబట్టు, ముడియూరు, కీళ్లపూడి, నీరువాయి, ఆరె గ్రామాల్లో నీట మునిగిన వేరుశనగ పంట, మినుము పంటలను పరిశీలించారు. తక్షణమే పొలాల్లోని నీటిని వెలుపలికి పంపి శిలీంద్రనాశిని మందును పిచికారీ చేస్తే పంట యథావిధిగా వస్తుందని రైతులకు అవగాహన కలిగించారు. అలాగే రైతులకు పలు సూచనలు , సలహాలు ఇచ్చారు.

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరువు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాల పరిశీలనకు బుధవారం వచ్చిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు విద్యార్థులు పాఠశాల, హాస్టల్‌లోని సమస్యలను ఏకరువు పెట్టారు. మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్ , గుడ్లు సక్రమంగా ఇవ్వడం లేదని , చికెన్ రెండు ముక్కలు వేస్తున్నారని, ప్రతి రోజూ పప్పు వేస్తున్నారని, స్నానానికి నీళ్లు లేవని, ఒక గదిలో 10 మంది ఉంటున్నామని, నీళ్ల పాలు, ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని, మెస్‌లో ఫ్యాన్లు లేవని, బాత్ రూమ్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వాపోయారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన తెలుగు తెలియని ఉపాధ్యాయులతో బోధించే బోధన అర్థం కాక చదవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయుడు సుమన్ కావాలని పట్టుబట్టారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్, వార్డెన్ సచిన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల కడుపు కొట్టడం సరికాదని హెచ్చరించారు. కలెక్టరు వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి హాస్టల్‌లోని పరిస్థితులను వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం , ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్ఐ విశ్వనాథనాయుడు, మధునాయుడు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని 24 రెవెన్యూ గ్రామాల్లో 6వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సదస్సులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6వ తేదీన తెత్రిపాడు, 7 పుత్తేరి, 9 ఆలత్తూరు, 10 భవానీ శంకరపురం, 11 కొత్తపాళెం , 12 టీబీపురం, 13 తేదీ పార్లపల్లి, 16న పల్లమాల, 17న కాటూరు, 18న ఆర్ అనంతాపుం, 19వ తేదీ చిన్నయగుంట, 20న పెద్దపాలేడు, 21 కనమనంబేడు, తంగెళ్లపురం, 22న గాజులపెళ్లూరు, 23వ తేదీ నీర్పాకోట, 24న కుక్కంబాకం , 26 కంచనపుత్తూరు, 27 వెస్టువరత్తూరు, 28 నెలవాయి, 30వ తేదీ కేవీపురం, 31న కల్లివెటు, జనవరి 2వ తేదీ తలారివెట్టు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వ భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులకు సర్వేయర్, ఎఎస్‌ఓ, వీఆర్‌ఓ, సబ్‌రిజిస్ట్రార్ సిబ్బంది, దేవాదాయశాఖ, అటవీశాఖ, అధికారులు హాజరు అవుతారన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.90 కోట్లు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుల ద్వారా రూ.1,90,35,265 ఆదాయం వచ్చినట్టు ఈవో బాపిరెడ్డి తెలిపారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించినట్టు తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 106 గ్రాములు, వెండి 466.100 కిలోలు, విదేశీ కరెన్సీ 121 వచ్చిందన్నారు.

వానొస్తే ప్రయాణాలు బంద్

- ఎనిమిది గ్రామాల రాకపోకలకు ఆటంకం
- వాగుపై లోలెవల్ వంతెనతో కష్టాలు



ఓబులరాజుల కండ్రిగ సమీపంలో ప్రవహిస్తున్న గొడ్డేరు వాగు

సత్యవేడు : వానొస్తే.. పీవీపురం మరో ఎనిమిది గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోతాయి. గొడ్డేరు వాగు ఎలువ నీరు ప్రవహిస్తే స్థానికులు ఇబ్బందులు పడాల్సిందే. దశాబ్దాలుగా ఈ సమస్య కొనసాగుతున్నా సమస్యకు పరిష్కారం చూపడం లేదు. ఎన్నికలప్పుడు వాగుపై హైలెవల్ వంతెన నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు హామీలు గుప్పిస్తున్నారు.. గెలిచిన తరువాత హామీల గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా వంతెన కష్టాలు మాత్రం తీరడం లేదు.

మండల పరిధిలోని పీవీపురం– నాగలాపురం మార్గంలో గొడ్డేరు వాగు వర్షాలకు ప్రస్తుతం ప్రవహిస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. విధిలేని పరిస్థితుల్లో కొందరు సాహసం చేసి వాగు దాటేందుకు ప్రయత్నించి చిక్కుల్లో పడుతున్నారు. 1991లో గొడ్డేరు వాగుపై లోవెవల్ బ్రిడ్జి నిర్మించారు. అయితే దాని వల్ల ఇక్కడి ప్రజల సమస్య తీరడంలేదు. హైలెవల్ వంతెన నిర్మిస్తే గానీ ఆయా గ్రామాల ప్రజలకు సమస్య తీరేదారి కనిపించడంలేదు.

ప్రజల అవస్థలు

వానాకాలం వస్తే గొడ్డేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనిపై వంతెన నిర్మించకపోవడంతో పాండూరు– నాగలాపురం మార్గంలోని పీవీపురం, ఓబులరాజు కండ్రిగ, ఓబులరాజు కండ్రిగ గిరిజన కాలనీ, చమర్తికండ్రిగ, రేపల్లెవాడ, రాజగోపాలపురం, ఆనందాపురం ఎస్టీ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు నాగలాపురం, పుత్తూరు కళాశాలలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు.

లోలెవల్ బ్రిడ్జితో ఇబ్బందులు



నాగలాపురం వెళ్లాంటే రాజగోపాలపురం పంచాయతీ ప్రజలకు గొడ్డేరు మార్గం ద్వారానే వెళ్లాల్సింది. వర్షాకాలం వచ్చిందంటే వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. లోలెవల్ బ్రిడ్జి వల్ల ఇబ్బందులు తప్పడంలేదు.

- దాయురాజు, పీవీపురం

హైలెవల్ వంతెన నిర్మించాలి



పాండూరు– నాగలాపురం రోడ్డును పీవీపురం వరకు డబుల్ రోడ్డు చేశారు. నాగలాపురం వరకు మిగిలి ఉన్న రోడ్డును ఆధునీకరించాలి. గొడ్డేరు వాగు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నాం.

- రఘుపతి రెడ్డి, సత్యవేడు